
# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, శనివారం 24 ఆగస్టు 2024 | KAMAREDDY


**షరతులు లేని పంట రుణాల** మాఫీ కోసం ఇందూరు రైతాంగం మరో పోరాటానికి శ్రీకారం చుట్టింది. ఎర్రజొన్నల ఉద్యమం తరహాలో మరోమారు రణభేరి మోగించింది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆంక్షల్లేని రుణమాఫీ కోసం శనివారం ఆర్మూర్ గడ్డ మీద మహా ధర్నాను నిర్వహించనున్నది. ఇందుకోసం మూడు నియోజకవర్గాల రైతులతో కూడిన రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. ఆంక్షల్లేని రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్లతో నిర్వహించనున్న ఈ శాంతియుత ఆందోళన కార్యక్రమానికి బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం తలపెట్టిన ఈ మహా ధర్నాను విజయవంతం చేసేందుకు అన్ని రైతు సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. మరోవైపు, కర్షకుల పోరాటానికి బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయి.

–మోర్తాడ్/డిచ్‌పల్లి, ఆగస్టు 23






ఆర్మూర్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు తరలిరావాలని రైతు సంఘాల నేతలను కోరుతున్న ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు

# మాఫీ కోసం మహా ధర్నా

## ఆర్మూర్‌లో నేడు అన్నదాతల ఆందోళన

- పార్టీలకతీతకంగా జరుగుతున్న కార్యక్రమం
- పాల్గొననున్న మూడు నియోజకవర్గాల రైతులు
- ధర్నాకు తరలివెళ్తామని ఊరూరా స్వచ్ఛంద తీర్మానాలు
- అనుమతి విషయంలో పోలీసుల ద్వంద వైఖరి
- ధర్నాను అడ్డుకునేందుకు సర్కారు కుటిల యత్నాలు

**అసెంబ్లీ** ఎన్నికల సమయంలో ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. అమలు చేసే విషయంలో అనేక కొర్రీలు పెట్టడం రైతాంగాన్ని ఆగ్రహానికి గురి చేసింది. మూడు విడుతల్లో మాఫీ చేసినప్పటికీ, జిల్లాలో సగం కన్నా తక్కువ మందికే మాఫీ వర్తించడం, మిగతా వారికి రాకపోవడంతో అన్నదాతల్లో అసంతృప్తి చెలరేగింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 19న అర్గుల్‌లో సమావేశమైన మూడు నియోజకవర్గాల అన్నదాతలు.. రైతు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. షరతుల్లేని రుణమాఫీ, రైతు భరోసా కోసం శనివారం జాతీయ రహదారిని దిగ్బంధించాలని నిర్ణయించారు. ఎర్రజొన్నల ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, మహాధర్నాకు పూనుకున్నారు. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న ఈ పోరాటానికి ఊరూరా మద్దతు వెల్లువెత్తుతుతున్నది. రైతుసంఘాలు ఆడ, మగ తేడాలేకుండా ప్రతి ఇంటి నుంచి ఇద్దరు చొప్పున ధర్నాకు వెళ్లాలని రైతు సంఘాలు తీర్మానించాయి.

### భారీగా తరలిరావాలి



ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 23: రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రైతు నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మద్దతు ప్రకటిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### షరతుల్లేని మాఫీ కోసమే..



రైతులకు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మోసం చేసింది. అందుకే శనివారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. మూడు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలి రానున్నారు. సాయిగార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పోలీసుల నుంచి అనుమతి లభించింది. షరతులు లేని రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి సూచిస్తాం. స్పందించకుంటే పోరాటాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలన్న విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మాలక్ష్యం ఒక్కటే. సీఎం చెప్పినట్లుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

**- ఇట్టడి లింగారెడ్డి, ఐక్యకార్యాచరణకమిటీ ఇన్‌చార్జి**

మహాధర్నాకు తరలిరావాలని నందిపేటలో రైతు సంఘాల నేతలను కోరుతున్న ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు

### పర్మిషన్‌పై ద్వంద వైఖరి..


రైతుల శాంతియుత ఆందోళనకు అనుమతి ఇచ్చే విషయంలో పోలీసుల ద్వంద వైఖరి తీవ్ర విమర్శలకు తావిచ్చింది. మహా ధర్నాకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, శాంతియుతంగా జరుపుకోవాలంటూ పలు షరతులు విధిస్తూ ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అనుమతి ఇచ్చారని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఇన్‌చార్జి ఇట్టడి లింగారెడ్డి తెలిపారు. మరోవైపు, బీఆర్ఎస్, బీజేపీ,లెఫ్ట్ పార్టీలు, ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్ పట్టణం మామిడిపల్లి చౌరస్తాలో 44వ నేషనల్ హైవేపై నిర్వహించ తలపెట్టిన 'చలో ఆర్మూర్' కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదని సీపీ కల్మేశ్వర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 25 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు విధిస్తున్నామని, చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అటు ఏసీపీ అనుమతి ఇవ్వడం, ఇటు సీపీ పర్మిషన్ లేదనడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

### బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిన వైనంపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే సమరభేరిని మోగించింది. మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 22న ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తాజాగా రైతుల నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ రైతులకు మద్దతుగా నిలుస్తుందని, పోరాటాన్ని కొనసాగిస్తుందని మాజీ మంత్రి వేముల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ప్రకటించారు. రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సర్కారు కుటిల యత్నాలు

రైతు మహా ధర్నా నేపథ్యంలో ఆందోళన చెందుతున్న ప్రభుత్వం.. ఎలాగైనా విఫలం చేసేందుకు కుటిల ప్రయత్నాలు ప్రారంభించింది. ధర్నా విజయవంతం కాకుండా రైతులపైకి పోలీసులను ఉసిగొల్పింది. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామాలకు వచ్చి ధర్నాకు వెళ్లవద్దని, అనుమతి లేని ఆందోళనకు వెళ్తే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ధర్నాను విజయవంతం చేసి సర్కారు కళ్లు తెరిపిస్తామని స్పష్టం చేస్తున్నారు.




PROCEEDINGS OF THE COMMISSIONER OF POLICE, NIZAMABAD COMMISSIONERATE.
Present: Sri. Kalmeshwar Shingenavar, IPS., Commissioner of Police, Nizamabad.

No. /86 /L&O/CSB/2024 Dtd:23.08.2024

Sub:- Nizamabad Police Commissionerate - Unlawfully formed farmers and BRS, BJP party workers of Balkonda, Armoor and Nizamabad Rural constituency at 'rasta roko' programme of farmers under the banner "Chalo Armoor" at NH-44, Mamidpally X- road, Armoor - Promulgation ...

ఆందోళనకు అనుమతి లేదని సీపీ జారీ చేసిన ఉత్తర్వులు



GOVERNMENT OF TELANGANA
POLICE DEPARTMENT

PROCEEDING OF THE ASST.COMMISSIONER OF POLICE :: ARMOOR DIVISION.
PRESENT: - SRI. G.Baswa Reddy

No. 06/Protest/ACP-AMR/2024 Dated: 23.08.2024

Sub:- Police–Armoor Division–Permission is accorded to Sri. Nakkala Bhooma Reddy and others farmers to conduct Farmers Meeting at Sai Garden Function hall, Mamidiply of Armoor Town on 24.08.2024 from 10:00 AM to 02:00 PM. Proceedings – Issued – Reg.

Subjected to the following conditions.

1. Maximum number of participants should not exceed permitted limit.
2. Protest to be held only between 10am and 2pm.
3. No blockage of roads or highways allowed and also shall not lead to consequence of obstruction to commuters.
4. Sufficient parking should be made available and Proper parking should be done.
5. All traffic rules and regulations shall be followed.
6. No public / private property should be damaged.
7. No abuse and assault on public servants.

శాంతియుత ధర్నాకు ఏసీపీ అనుమతి జారీ చేసినట్లు రైతులు విడుదల చేసిన పత్రం

# మా గోడు వినేదెవ్వరు?





ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్యాలయం

వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట వేచిచూస్తున్న రైతులు

- సమయపాలన పాటించని వ్యవసాయ శాఖ అధికారులు
- కార్యాలయం వద్ద రైతన్నల పడిగాపులు

భీమ్‌గల్, ఆగస్టు 23: 'రుణమాఫీ జరగని రైతులు వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వండి..అధికారులు మీ సమస్యను పరిష్కరిస్తారు' అంటూ సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అలాంటిదేమీ కనిపించడం లేదు. అందుకు నిదర్శనమే భీమ్‌గల్‌లోని సహాయక వ్యవసాయ సంచాలక, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలు. ఈ ఆఫీసుల పరిధిలో ఐదు వ్యవసాయ క్లస్టర్లు ఉండగా, ఏవోతోపాటు ఐదుగురు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు విధులు నిర్వర్తిస్తుంటారు. వివిధ కారణాలతో రుణమాఫీ జరగని రైతులు శుక్రవారం అధికారులను కలిసి తమ గోడు వెళ్లబోసుకుందామని రాగా.. కార్యాలయానికి తాళం దర్శనమిచ్చింది. ఉదయం 11దాటినా ఏ ఒక్క అధికారి రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు వచ్చేవరకు పడిగాపులు కాశారు. మరోవైపు అర్హులమైన తమకు రుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

### రైతుల్ని మోసం చేసిండు..



ఎన్నికల్లో గెలిచినంక అందరికీ రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిండు. నమ్మి.. ఓట్లు వేసినం. అధికారంలోకి రాగానే ఏదో కొందరికి చేసి చేతులు దులుపుకొన్నాడు ఈ సీఎం రేవంత్ రెడ్డి. ఇచ్చిన మాటప్రకారం అందరికీ రుణమాఫీ చేయాలే.. లేకుంటే రైతులమందరం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసుడే.

**- చిన్నోళ్ల గంగాప్రసాద్, రైతు, జాగిర్యాల్**

### సుక్కలు సూపెడుతున్నడు..



నమ్మి ఓట్లు వేసిన మాకు ఇప్పుడు సుక్కలు సూపెడుతున్నడు.బ్యాంకులో తీసుకున్న రు ణం మాఫీ అయితదని సంబురపడ్డం.కానీ, ఇప్పుడు మాఫీకాక పొద్దున లేచిన నుంచి ఆఫీసుల సుట్టూ తిరుగుతున్నం. రుణమాఫీ అయితదని ఏ ఒక్క సారూ చెప్తలేరు. మా బాధలు ఎవరికి చెప్పాలా అని ఆఫీసుకు వస్తే ఇక్కడేమో సార్లు లేరు.

**- దేవాగత్ సీతారాం, రైతు, ఎంజీ తండా**

### పొద్దున్నే అచ్చిన..



తీసుకున్న రుణం మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే మాకేం తెల్వదు అంటున్నరు. రుణం మాఫీ చేస్తామంటే ఓట్లు వేసి గెలిపించినం. కానీ, ఇప్పుడు మమ్మల్ని మస్తు బాధ పెడుతున్నదీ కాంగ్రెస్ సర్కారు. పొద్దున అచ్చికూసున్న పదకొండు అయినా ఓళ్లు రాలేదు.

**-గుగ్లోత్ జెన్ను, మహిళా రైతు, కారేపల్లి**

### దండంపెడతా మాఫీ చేయుండ్రి



రుణమాఫీ వస్తదని మస్తు సంబురపడ్డాం. తీరా ఇప్పుడు మాఫీ కాకపోవడంతో ఏం చేయాలో అర్థం అయితలేదు. మా ఊర్లో చానా మంది రైతులకు మాఫీ కాలేదు. ఆఫీసుల పొంట తిరుగుతున్న. ఏ ఒక్కరు కూడా సక్కంగ చెప్తలేరు. సీఎం సారూ నీకు దండంపెడుతా జర రుణమాఫీ చెయ్యి.

**- గుగ్లోత్ రాములు, రైతు, కారేపల్లి**

### మాఫీ చెయ్యాలే..



తీసుకున్న రుణం మాఫీ కాక ఎదురుచూస్తున్నం. గెలిచిన వెంటనే రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పిండు. ఎట్లగైనా రైతులకు ఇచ్చినమాట ప్రకారం మాఫీ చె య్యాలే. లేకుంటే రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం చెప్తం.

**- ద్యాగ నర్సయ్య, రైతు, భీమ్‌గల్**

# ప్రశ్నిస్తే బయటకు పొమ్మంటుండ్రు.. పైసలిస్తేనే పనులు చేస్తుండ్రు..



నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 23: 'ఇక్కడ పైసలిస్తేనే పని చేస్తరు.. దళారీతో వస్తే దర్జాగా పని అవుతది..ప్రశ్నిస్తే పనులు కావు.. ఎవరికైనా చెప్పుకో పో అంటూ బెదిరిస్తారు' అంటూ నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట పలువురు రైతులు, బాధితులు శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ దళారులతో వెళ్తేనే తహసీల్దార్ లక్ష్మణ్ పనులు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య ఇల్లరికం వచ్చిన తన అల్లుడు కుమ్మరి పరమేశ్ ఆధార్ కార్డు ఇక్కడికి మార్చుకున్నాడని, లోకల్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారన్నారు. డిగ్రీ చదువు కోసం కులం, ఆదాయం సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తు చేసుకోగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం అడిగితే సర్టిఫికెట్లు ఇవ్వనని, ఎవరికైనా చెప్పుకోండని బయటికి పంపించినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. పట్టా మార్పిడి చేయాలని మూడు నెలలుగా తిరుగుతున్నా చేయకుండా తిప్పుతున్నారని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన బాలయ్య తెలిపారు. ఇక్కడంతా డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని.. పలువురు రైతులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. కార్యాలయంలో తండ్రి స్థానంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అన్నీ తానై పనులు చక్కబెడుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. దాదాపు ఆరునెలలుగా ఈ తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

ఈ విషయంపై తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా తాను ఎవరి వద్ద డబ్బులు తీసుకోవడం లేదని, రికార్డులో ఉన్నట్లు, నిబంధనల ప్రకారం పనులు చేస్తున్నానని తెలిపారు. నాకు తెలియకుండా నా పేరిట ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### పైసలు ఇస్తేనే పనులు చేస్తుండ్రు



తహసీల్ కార్యాలయంలో పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నారు. నెలరోజుల క్రితం మా తండ్రి పేరున ఉన్న వ్యవసాయ భూమిని అన్నదమ్ములపై మార్పిడి చేసుకోవడానికి రూ.15వేలు డిమాండ్ చేసింండ్రు. ఇవ్వకపోతే చుట్టూ తిప్పుకుండ్రు. రూ.12వేలు ఇస్తేనే పని చేసిండ్రు. ఇప్పుడు అల్లుడు పరమేశ్‌కు నివాసం సర్టిఫికెట్ ఇచ్చారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వమంటే ఇబ్బంది పెడ్తుండ్రు. గట్టిగా అడిగితే బయటికి పొమ్మంటున్నరు.

**- కుమ్మరి అంజయ్య, నాగిరెడ్డిపేట**

### మూడు నెలలుగా తిప్పుతున్నారు



మా అత్తమ్మ సత్తమ్మ చనిపోయింది. ఆమె పేరున 12గుంటల భూమి ఉన్నది. కూతురు ఎల్లవ్వ ఒక్కతే వారసురాలు. మరణధృవపత్రం కూడా తెచ్చిన. మూడు నెలలుగా ఏవేవో కారణాలు చెబు తూ.. పట్టామార్పిడి చేయడం లేదు. డబ్బు లు తీసుకొని ఫలానా వ్యక్తి తో వస్తే పని అయిపోతదని ఇక్కడ ఉన్న సిబ్బంది చెబుతున్నారు. నేను డబ్బు లు ఇచ్చే పరిస్థితిలో లేను. కలెక్టర్ దగ్గరికి వెళ్లి కాళ్లయినా పట్టుకుంటా కానీ, ఇక్కడ డబ్బులు ఇచ్చి పనిచేసుకోను.

**- గులపల్లి బాలయ్య, ధర్మారెడ్డి గ్రామం**

# నిధులు లేవు.. నీళ్లు రావు..

చందూర్, ఆగస్టు 23: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో వారం రోజులుగా నీటిఎద్దడి నెలకొన్నది. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతోపాటు చెరువువద్ద నీటి కోసం ఏర్పాటు చేసిన మోటారు పంపు సెట్లు పనిచేయడం లేదు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా నిధులు లేవని సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం నీటికోసం చుట్టు పక్కన పంట పొలాలు, సొసైటీ వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ఎద్దడి తీర్చాలని కోరుతున్నారు.




లక్ష్మాపూర్‌లో సొసైటీ బోరుబావి వద్ద బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

### వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే దాడి

నస్రుల్లాబాద్, ఆగస్టు 23: సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన బీజేపీ కార్యకర్తపై కాంగ్రెస్ కార్యకర్త దాడి చేసిన ఘటన బీర్కూర్‌లో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వ్యవసాయ శాఖ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కార్యకర్త వడ్ల బస్వరాజ్ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లాడు. అదే సమయంలో బీర్కూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సాహెబ్‌రావు.. తనపై దాడి చేసి బెదిరించాడని బస్వరాజ్ పేర్కొన్నాడు. దీంతో బాన్సువాడ రూరల్ సీఐకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### భారీ వర్షం

#### ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ

ఖలీల్‌వాడి, ఆగస్టు 23: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి, ఆర్మూర్, మాక్లూర్, నిజామాబాద్ నార్త్, సిరికొండ, డిచ్‌పల్లి తదితర మండలాల్లో వర్షం కురిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 27 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.